ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 02-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ.. సమాన అవకాశాలు పొందినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- భారత్, కెనడా దేశాల మధ్య పలు కీలక రంగాలలో మూడు పరస్పర అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

- పశ్చిమాసియాలో నెలకొన్న వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.

- భారతదేశ లాజిస్టిక్స్ వ్యయాన్ని 2030 నాటికి 10 శాతం కంటే తక్కువకు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు.

=======================

మహిళలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ.. ఆత్మగౌరవం, సమాన అవకాశాలు పొందినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 'సశక్త్ నారి, సమృద్ధ్ ఢిల్లీ' కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా "ఢిల్లీ లఖ్‌పతి బిటియా యోజన"ను ప్రారంభించారు. ఈ పథకం కింద ఆడపిల్లల పేరు మీద దశల వారీగా పలు మొత్తాలను ఢిల్లీ ప్రభుత్వం డిపాజిట్ చేయనుంది. "ఢిల్లీ లఖ్‌పతి బిటియా యోజన"తో పాటూ సహేలి పింక్ స్మార్ట్ కార్డ్, మేరీ పూంజీ మేరా అధికార్, ఉచిత ఎల్‌పిజి సిలిండర్ పథకాలను కూడా రాష్ట్రపతి ఢిల్లీ మహిళల కోసం ప్రారంభించారు. అనంతరం రాష్ట్రపతి మాట్లాడుతూ... ప్రధానమంత్రి ఉజ్వల యోజన, బేటీ బచావో... బేటీ పఢావో, ప్రధానమంత్రి మాతృ వందన యోజన వంటి పరివర్తనాత్మక కార్యక్రమాల ద్వారా కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందని చెప్పారు.

(వాయిస్ 25 సెకన్లు)

=======================

కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ భారత్ పర్యటన సందర్భంగా ఇరు దేశాల మధ్య మూడు పరస్పర అవగాహన ఒప్పందాలను కుదిరాయి. వ్యూహాత్మక ఖనిజాలు, పునరుత్పాదక ఇంధనం, సాంస్కృతిక రంగాలలో సహకారంతో సహా వివిధ రంగాలలో మూడు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ న్యూఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఈరోజు ప్రతినిధి స్థాయి బృందం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు భారతదేశం-కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యంలోని వివిధ రంగాలలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో నరేంద్ర మోదీ మాట్లాడుతూ... ప్రజాస్వామ్య విలువలు, వైవిధ్యం పట్ల భారత్-కెనడా దేశాలకు తిరుగులేని విశ్వాసం ఉందని పేర్కొన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా, 2030 నాటికి 50 బిలియన్ల డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

(వాయిస్ 28 సెకన్లు)

అదే విధంగా పశ్చిమాసియాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిపై కూడా ప్రధానమంత్రి స్పందించారు. వివాదాల పరిష్కారానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ఉద్ఘాటించారు. ఆ ప్రాంతంలో ఉన్న భారతీయుల రక్షణకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ భారత పర్యటన రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను తదుపరి దశకు తీసుకువెళ్లేందుకు దోహదపడిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. మార్క్ కార్నీ భారత పర్యటన గురించి తూర్పు ప్రాంత విదేశాంగ కార్యదర్శి పి. కుమరన్ న్యూఢిల్లీలో ఈరోజు పాత్రికేయులకు వివరిస్తూ... ఈ పర్యటన క్లీన్ ఎనర్జీ, ఫిన్‌టెక్ రంగాలలో సహకారం సహా గణనీయమైన వాణిజ్య ఫలితాలను సాధించిందని చెప్పారు. ఇంధన రంగంలో సహకారం ఈ పర్యటనలో ప్రధానంగా నిలిచిందని చెప్పారు. ఇరు దేశాల మధ్య "సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (CEPA)"పై చర్చలను త్వరగా ముగించాల్సిన అవసరం ఉందని కెనడా ప్రధాన మంత్రి స్పష్టం చేశారని కుమరన్ తెలియజేస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

ఇక కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ 4 రోజుల భారత్ పర్యటన ముగించుకొని ఆస్ట్రేలియా బయల్దేరారు. విమానాశ్రయంలో మార్క్ కార్నీ దంపతులకు కేంద్ర వాణిజ్య శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద వీడ్కోలు పలికారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశాభివృద్ధిని కాంక్షిస్తూ.. 2030 నాటికి భారతదేశ లాజిస్టిక్స్ వ్యయాన్ని 10 శాతం కంటే తక్కువకు తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, నూతన పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన "సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్" (CWC) 70వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతీయ వేర్ హౌసింగ్ మార్కెట్ ఏటా 15 శాతం వృద్ధి రేటుతో పురోగమిస్తోందన్నారు. ఇది 2027 నాటికి సుమారు 35 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ గల్ఫ్ దేశాల నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్ లో మాట్లాడారు. బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫా, సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌తో ఫోన్‌లో మాట్లాడి.. ఆ రెండు దేశాలపై ఇరాన్ జరిపిన దాడులను ఖండించారు. ఇరు దేశాల్లో భారతీయుల క్షేమ సమాచారం గురించి వారితో ప్రస్తావించారు. ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించడం అత్యంత ముఖ్యమైనదని, ఇరుపక్షాలు అంగీకరించాయని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయాల్లో భారతీయ సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్నందుకు ప్రధానమంత్రి వారిరువురుకి కృతజ్ఞతలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర బడ్జెట్ 2026-27 పై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా 'MSME యాజ్ ఛాంపియన్స్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై రేపు వెబినార్ నిర్వహిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఉదయం 11 గంటలకు ఈ వెబినార్ ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు MSME లను వెన్నెముకగా మార్చాలనే ఉద్దేశంతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి 2026-27 బడ్జెట్‌లో ప్రభుత్వం నూతన ఉత్తేజం కల్పించింది. భవిష్యత్ ఛాంపియన్లను సృష్టించడానికి 10 వేల కోట్ల రూపాయల ప్రత్యేక MSME గ్రోత్ ఫండ్ ను ఈ వార్షిక బడ్జెట్ లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సూక్ష్మ సంస్థలకు మద్దతు కొనసాగించడానికి అదనంగా 2 వేల కోట్ల రూపాయలతో స్వయం నిర్భర్ భారత నిధిని కూడా కేటాయించనున్నామని బడ్జెట్ లో ప్రభుత్వం పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత వాయువ్య ప్రాంతాలలో రానున్న ఐదు రోజుల పాటు గరిష్ఠ ఉష్ణోగ్రత 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేరకు పెరగవచ్చని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. అలాగే.. దేశ మధ్య ప్రాంతాలలో 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ పెరుగుతుందని ఆ శాఖ పేర్కొంది. గుజరాత్, కొంకణ్, గోవా ప్రాంతాలలో ఈ నెల 4 నుంచి 6 వరకు తేమతో కూడిన ఉక్కపోత పరిస్థితి నెలకొంటుందని, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్ లలో రేపటి వరకు వేడితో కూడిన గాలులు వీచే అవకాశం ఉన్నట్లు ఐఎండీ తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =